06-09-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీ ఈ చదువు సంపాదనకు ఆధారము, ఈ చదువు ద్వారా 21 జన్మల కొరకు సంపాదనకు ఏర్పాటు జరుగుతుంది"

ప్రశ్న:- ముక్తిధామములోకి వెళ్ళడము సంపాదనా లేక నష్టమా?

జవాబు:- భక్తుల కొరకు ఇది కూడా సంపాదనే ఎందుకంటే అర్ధకల్పం నుండి శాంతి-శాంతి అని యాచిస్తూ వచ్చారు. ఎంతో శ్రమించిన తర్వాత కూడా శాంతి లభించలేదు. ఇప్పుడు తండ్రి ద్వారా శాంతి లభిస్తుంది అనగా ముక్తిధామములోకి వెళ్తారు, కావున ఇది కూడా అర్ధకల్పము యొక్క శ్రమకు ఫలము అయినట్లు, అందుకే దీనిని కూడా సంపాదన అనే అంటారు, నష్టము అని అనరు. పిల్లలైన మీరైతే జీవన్ముక్తిలోకి వెళ్ళేందుకు పురుషార్థము చేస్తారు. మీ బుద్ధిలో ఇప్పుడు మొత్తం ప్రపంచం యొక్క చరిత్ర-భౌగోళికము నాట్యం చేస్తుంది.

ఓం శాంతి. మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి ఇదైతే అర్థం చేయించారు - ఆత్మయే అన్నీ అర్థం చేసుకుంటుంది. ఈ సమయములో పిల్లలైన మిమ్మల్ని ఆత్మిక ప్రపంచములోకి తండ్రి తీసుకువెళ్తారు. దానిని ఆత్మిక దైవీ ప్రపంచము అని అంటారు, దీనిని దైహిక ప్రపంచము, మనుష్యుల ప్రపంచము అని అంటారు. దైవీ ప్రపంచముండేదని, అది దైవీ మనుష్యుల పవిత్ర ప్రపంచము అని పిల్లలు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు మనుష్యులు అపవిత్రులుగా ఉన్నారు, అందుకే ఆ దేవతలను మహిమ చేస్తూ, పూజిస్తూ ఉంటారు. తప్పకుండా మొదట వృక్షములో ఒకే ధర్మం ఉంటుంది అన్న స్మృతి ఉంది. విరాట రూపములో వృక్షము గురించి కూడా అర్థం చేయించాలి. ఈ వృక్షానికి బీజరూపుడు పైన ఉన్నారు. వృక్షానికి బీజము తండ్రి, అయితే బీజము ఎలా ఉంటుందో అటువంటి ఫలము అనగా ఆకులు వెలువడుతాయి. ఇది కూడా అద్భుతము కదా. ఎంత చిన్నని వస్తువు ఎంతటి ఫలాన్ని ఇస్తుంది. ఎంతగా తన రూపము మారిపోతూ ఉంటుంది. ఈ మనుష్య సృష్టి రూపీ వృక్షము గురించి ఎవ్వరికీ తెలియదు, దీనిని కల్పవృక్షము అని అంటారు, దీని గురించి కేవలం గీతలోనే వర్ణన ఉంది. గీతయే నెంబర్ వన్ ధర్మ శాస్త్రమని అందరికీ తెలుసు. శాస్త్రాలు కూడా నంబరువారుగా ఉంటాయి కదా. ధర్మాల స్థాపన నంబరువారుగా ఎలా జరుగుతుంది, ఇది కూడా కేవలం మీరే అర్థం చేసుకుంటారు, ఇంకెవరిలోనూ ఈ జ్ఞానముండదు. మొట్టమొదట ఏ ధర్మము యొక్క వృక్షముంటుంది మరియు అందులో ఇతర ధర్మాల వృద్ధి ఎలా జరుగుతుంది అనేది మీ బుద్ధిలో ఉంది. దీనిని విరాట నాటకము అని అంటారు. పిల్లల బుద్ధిలో మొత్తం వృక్షమంతా ఉంది. వృక్షము యొక్క ఉత్పత్తి ఎలా జరుగుతుంది అన్నదే ముఖ్యమైన విషయము. దేవీ-దేవతల వృక్షము ఇప్పుడు లేదు, మిగిలిన శాఖోపశాఖలన్నీ నిలబడి ఉన్నాయి కానీ ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము యొక్క పునాది లేదు. ఒక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తారు, మిగిలిన ధర్మాలన్నీ వినాశనమైపోతాయి అన్న గాయనము కూడా ఉంది. ఎంత చిన్నని దైవీ వృక్షముంటుంది అనేది ఇప్పుడు మీకు తెలుసు. ఇక ఆ తర్వాత ఇన్ని ధర్మాలేవీ ఉండనే ఉండవు. వృక్షము మొదట చిన్నగా ఉంటుంది, ఆ తర్వాత పెద్దగా అవుతూ ఉంటుంది. పెద్దగా పెరుగుతూ, పెరుగుతూ ఇప్పుడు ఎంత పెద్దగా అయిపోయింది. ఇప్పుడు దీని ఆయువు పూర్తి అవుతుంది, దీనిని మర్రి వృక్షము ఉదాహరణతో చాలా బాగా అర్థం చేయిస్తారు. ఇది కూడా గీతా జ్ఞానమే, దీనిని తండ్రి మీకు సమ్ముఖముగా కూర్చొని వినిపిస్తారు, దీని ద్వారా మీరు రాజులకే రాజులుగా అవుతారు. మళ్ళీ భక్తి మార్గములో ఈ గీతా శాస్త్రము మొదలైనవి తయారవుతాయి. ఈ అనాది డ్రామా తయారై ఉంది. మళ్ళీ ఇదే విధముగా జరుగుతుంది. తర్వాత ఏయే ధర్మాలైతే స్థాపన అవుతాయో వారికి తమ శాస్త్రాలు ఉంటాయి. సిక్కు ధర్మము వారికి తమ శాస్త్రము, క్రిస్టియన్లు మరియు బౌద్ధులకు తమ, తమ శాస్త్రాలు ఉంటాయి. ఇప్పుడు మీ బుద్ధిలో మొత్తం ప్రపంచము యొక్క చరిత్ర, భౌగోళములు నాట్యం చేస్తున్నాయి. బుద్ధి జ్ఞాన నాట్యము చేస్తోంది. మీరు మొత్తం వృక్షమంతటినీ తెలుసుకున్నారు. ధర్మాలు ఏ విధంగా వస్తాయో, ఏ విధంగా వృద్ధి చెందుతాయో తెలుసుకున్నారు. ఆ తర్వాత మన ఒక్క ధర్మము స్థాపన అవుతుంది, మిగిలినవన్నీ అంతమైపోతాయి. జ్ఞాన సూర్యుడు ఉదయించాడు... అని గానం చేస్తారు కదా. ఇప్పుడు పూర్తిగా అంధకారము ఉంది కదా. ఎంతమంది మనుష్యులు ఉన్నారు, కానీ తర్వాత ఇంతమంది ఉండనే ఉండరు. ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యములో వీరు లేరు. మళ్ళీ ఏక ధర్మ స్థాపన జరగవలసిందే. ఈ జ్ఞానాన్ని తండ్రే వచ్చి వినిపిస్తారు. పిల్లలైన మీరు సంపాదన కొరకు ఎంతటి చదువును వచ్చి చదువుకుంటారు. తండ్రి టీచరుగా అయి వచ్చేటప్పటికి అర్ధకల్పము కొరకు మీ సంపాదన కోసం ఏర్పాటు జరుగుతుంది. మీరు చాలా ధనవంతులుగా అయిపోతారు. ఇప్పుడు మనం చదువుకుంటున్నామని మీకు

తెలుసు. ఇది అవినాశీ జ్ఞాన రత్నాల చదువు. భక్తిని అవినాశీ జ్ఞాన రత్నాలు అని అనరు. భక్తిలో మనుష్యులు ఏదైతే చదువుతారో దాని ద్వారా నష్టమే కలుగుతుంది. వారు రత్నాల వలె తయారవ్వరు. జ్ఞాన రత్నాల సాగరుడు అని ఒక్క తండ్రినే అంటారు. ఇకపోతే అది భక్తి. అందులో ఎటువంటి లక్ష్యము-ఉద్దేశ్యమూ లేదు, సంపాదన లేదు. సంపాదన కొరకైతే స్కూల్లో చదువుకుంటారు. మళ్ళీ భక్తి చేయడానికి గురువు వద్దకు వెళ్తారు. కొందరు యవ్వనంలోనే గురువును ఆశ్రయిస్తారు, కొందరు వృద్ధాప్యములో గురువును ఆశ్రయిస్తారు, కొందరు బాల్యములోనే సన్యాసము స్వీకరిస్తారు. కుంభమేళాల వద్దకు ఎంతమంది వస్తారు. సత్యయుగములోనైతే ఇవేవీ ఉండవు. పిల్లలైన మీ స్మృతిలోకి అన్ని విషయాలూ వచ్చాయి. రచయిత మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల గురించి మీరు తెలుసుకున్నారు. వారైతే కల్పము ఆయువునే పెద్దగా చేసేసారు. ఈశ్వరుడు సర్వ్వవ్యాపి అని అనేశారు. జ్ఞానము గురించి వారికి తెలియదు. తండ్రి వచ్చి అజ్ఞాన నిద్ర నుండి సుజాగృతులుగా చేస్తారు. ఇప్పుడు మీకు జ్ఞాన ధారణ జరుగుతూ ఉంటుంది. బ్యాటరీ నిండుతూ ఉంటుంది. జ్ఞానము ద్వారా సంపాదన, భక్తి ద్వారా నష్టము. ఎప్పుడైతే నష్టము వాటిల్లే సమయము పూర్తి అవుతుందో అప్పుడు మళ్ళీ తండ్రి సంపాదనను చేయించేందుకు వస్తారు. ముక్తిలోకి వెళ్ళడము - ఇది కూడా సంపాదనే. శాంతిని అయితే అందరూ కోరుకుంటూ ఉంటారు. శాంతిదేవ అని అనడంతో బుద్ధి తండ్రి వైపుకు వెళ్ళిపోతుంది. విశ్వములో శాంతి ఏర్పడాలి అని అంటారు, కానీ అది ఎలా ఏర్పడుతుంది - ఇది ఎవ్వరికీ తెలియదు. శాంతిధామము, సుఖధామము వేర్వేరు - ఇది కూడా తెలియదు. మొదటి నంబరువారు ఎవరైతే ఉన్నారో, వారికి కూడా ఇంతకుముందు ఏమీ తెలియదు. ఇప్పుడు మీకు మొత్తం జ్ఞానమంతా ఉంది. మనం ఈ కర్మ క్షేత్రములో కర్మ యొక్క పాత్రను అభినయించేందుకు వచ్చామని మీకు తెలుసు. ఎక్కడి నుండి వచ్చాము? బ్రహ్మలోకము నుండి. ఈ సాకారీ ప్రపంచములో పాత్రను అభినయించేందుకు నిరాకారీ ప్రపంచము నుండి వచ్చాము. ఆత్మలమైన మనం వేరే స్థానము యొక్క నివాసులము. ఇక్కడ ఈ పంచ తత్వాల శరీరము ఉంటుంది. శరీరము ఉంది, కావుననే మనం మాట్లాడగలుగుతాము. మనము చైతన్య పాత్రధారులము. ఈ డ్రామా ఆదిమధ్యాంతాల గురించి మాకు తెలియదు అని ఇప్పుడు మీరు అనరు. ఇంతకుముందు మీకు తెలియదు. మీ తండ్రి గురించి, మీ ఇంటి గురించి, మీ రూపము గురించి ఇంతకుముందు యథార్థముగా తెలియదు. ఆత్మ ఏ విధముగా పాత్రను అభినయిస్తూ ఉంటుంది అనేది ఇప్పుడు తెలుసు. స్మృతి కలిగింది. ఇంతకుముందు స్మృతి లేదు.

సత్యమైన తండ్రే సత్యాన్ని వినిపిస్తారని, దాని ద్వారా మనం సత్యఖండానికి యజమానులుగా అవుతామని మీకు తెలుసు. సత్యము గురించి కూడా సుఖమనిలో ఉంది (సుఖమని అనేది గురు గ్రంథ్ సాహిబ్ లో కనిపించే సిక్కు సంప్రదాయములోని ఒక ప్రాథమిక గ్రంథము). సత్యఖండమును సత్యం అని అంటారు. దేవతలందరూ సత్యం మాట్లాడేవారిగా ఉంటారు. సత్యాన్ని నేర్పించేవారు తండ్రి. వారికి ఎంత మహిమ ఉందో చూడండి. గానం చేయబడిన ఉన్న మహిమ మీకు ఉపయోగపడుతుంది. శివబాబా యొక్క మహిమను చేస్తారు. వారికే వృక్షము యొక్క ఆదిమధ్యాంతాల గురించి తెలుసు. సత్యమైన తండ్రి వినిపిస్తారు కావున పిల్లలైన మీరు సత్యమైనవారిగా అవుతారు. సత్యఖండము కూడా తయారవుతుంది. భారత్ సత్యఖండముగా ఉండేది. నెంబర్ వన్ ఉన్నతోన్నతమైన తీర్థము కూడా ఇదే ఎందుకంటే సర్వుల సద్గతిని చేసే తండ్రి భారత్ లోనే వస్తారు. ఏక ధర్మ స్థాపన జరుగుతుంది, మిగిలినవాటన్నింటి వినాశనము జరుగుతుంది. తండ్రి అర్థం చేయించారు - సూక్ష్మవతనములో ఏమీ లేదు, ఇవన్నీ సాక్షాత్కారమవుతాయి. భక్తి మార్గములో కూడా సాక్షాత్కారమవుతుంది. సాక్షాత్కారమవ్వకపోతే ఇన్ని మందిరాలు మొదలైనవి ఎలా తయారవుతాయి! పూజ ఎందుకు జరుగుతుంది! సాక్షాత్కారాలు పొందుతారు, వీరు చైతన్యముగా ఉండేవారు అని అనుభవం చేసుకుంటారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - భక్తి మార్గములో మందిరాలు మొదలైనవి ఏవైతే తయారవుతాయో, ఏదైతే మీరు విన్నారో, చూసారో, అదంతా రిపీట్ అవుతుంది. చక్రము తిరుగుతూనే ఉంటుంది. జ్ఞానము మరియు భక్తి యొక్క ఆట తయారై ఉంది. ఎల్లప్పుడూ జ్ఞానము, భక్తి, వైరాగ్యము అని అంటారు. కానీ విస్తారముగా ఏమీ తెలియదు. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - జ్ఞానము పగలు, భక్తి రాత్రి. వైరాగ్యము రాత్రి పట్ల కలుగుతుంది, మళ్ళీ పగలు వస్తుంది. భక్తిలో దుఃఖము ఉంది, అందుకే దాని పట్ల వైరాగ్యము కలుగుతుంది. సుఖము పట్ల వైరాగ్యము అని అనరు. సన్యాసము మొదలైనవాటిని కూడా దుఃఖము కారణముగానే తీసుకుంటారు. పవిత్రతలో సుఖము ఉంది అని భావిస్తారు, అందుకే స్త్రీని త్యజించి వెళ్ళిపోతారు. ఈ రోజుల్లోనైతే ధనవంతులుగా కూడా అయిపోయారు ఎందుకంటే సంపద లేకుండా సుఖము లభించదు. మాయ దాడి చేసి అడవి నుండి మళ్ళీ నగరాలలోకి తీసుకువస్తుంది. వివేకానందుడు మరియు రామకృష్ణుడు అనే ఇద్దరు గొప్ప సన్యాసులు కూడా ఒకప్పుడు ఉండి వెళ్ళారు. సన్యాసము యొక్క శక్తి రామకృష్ణుడిలో ఉండేది, ఇకపోతే భక్తిని గురించి అర్థం చేయించడం, చేయడం మొదలైనవి వివేకానందుడిలో ఉండేవి. ఇరువురి పుస్తకాలూ ఉన్నాయి. పుస్తకాలు వ్రాసేటప్పుడు ఏకాగ్రచిత్తులై

కూర్చుని వ్రాస్తారు. రామకృష్ణుడు తమ జీవిత చరిత్రను వ్రాసే సమయములో, తమ శిష్యునికి కూడా నీవు వెళ్ళి దూరంగా కూర్చో అని చెప్పారు. అతను చాలా తీక్షణమైన, గట్టి సన్యాసి, అతనికి పేరు కూడా ఎంతో ఉంది. భార్యను తల్లిగా సంబోధించండి అని బాబా అనరు, ఆమెను కూడా ఆత్మగా భావించండి అని బాబా అంటారు. ఆత్మలందరూ పరస్పరం సోదరులే. సన్యాసుల విషయం వేరు, రామకృష్ణుడు తన పత్నిని తల్లిగా భావించారు. కూర్చొని తల్లిని మహిమ చేసారు. ఇది జ్ఞాన మార్గము, వైరాగ్యము విషయం వేరు. వైరాగ్యములోకి వచ్చి భార్యను తల్లిగా భావించారు. మాత అన్న పదములో అశుద్ధమైన దృష్టి ఉండదు. సోదరి వైపుకు కూడా అశుద్ధ దృష్టి వెళ్ళవచ్చు కానీ తల్లి గురించి ఎప్పుడూ అశుద్ధ ఆలోచనలు కలగవు. తండ్రికి కూతురు వైపు అశుద్ధ దృష్టి వెళ్ళవచ్చు కానీ తల్లి వైపు ఎప్పుడూ వెళ్ళదు. ఆ సన్యాసి భార్యను తల్లిగా భావించడం మొదలుపెట్టారు. కానీ అతని విషయములో - అలా అయితే ప్రపంచం ఎలా నడుస్తుంది, పుట్టుక ఎలా జరుగుతుంది అని అడగరు. అతను ఒకరికి వైరాగ్యం వచ్చింది, తల్లి అని అనేశారు. అతనికి ఎంత మహిమ ఉందో చూడండి. ఇక్కడ సోదరీ-సోదరులుగా భావించినా కూడా చాలామంది దృష్టి వెళ్తూ ఉంటుంది, అందుకే బాబా అంటారు, పరస్పరం సోదరులుగా భావించండి. ఇది జ్ఞానము యొక్క విషయము. అక్కడ అది ఒక్కరి విషయము, ఇక్కడైతే ప్రజాపిత బ్రహ్మ సంతానముగా ఎంతోమంది సోదరీ, సోదరులున్నారు కదా. తండ్రి కూర్చొని అన్ని విషయాలనూ అర్థం చేయిస్తారు. బ్రహ్మబాబా కూడా శాస్త్రాలు మొదలైనవి చదివారు కదా. ఆ సన్యాస ధర్మమే వేరు, అది నివృత్తి మార్గానికి చెందినది, అది కేవలం పురుషుల కోసమే, అది హద్దులోని వైరాగ్యము, మీకైతే మొత్తం అనంతమైన ప్రపంచము పట్ల వైరాగ్యము ఉంది. సంగమములోనే తండ్రి వచ్చి మీకు అనంతమైన విషయాలను అర్థం చేయిస్తారు. ఇప్పుడు ఈ పాత ప్రపంచము పట్ల వైరాగ్యము కలగాలి. ఇది చాలా పతితమైన ఛీ-ఛీ ప్రపంచము. ఇక్కడ శరీరాలు పావనంగా ఉండలేవు. ఆత్మకు కొత్త శరీరము సత్యయుగములోనే లభించగలదు. ఇక్కడ ఆత్మ పవిత్రముగా అయినా కానీ శరీరమైతే అపవిత్రముగానే ఉంటుంది, కర్మాతీత అవస్థను పొందేంత వరకూ అపవిత్రముగానే ఉంటుంది. బంగారములో కల్తీ కలిస్తే నగలు కూడా కల్తీగా తయారవుతాయి. కల్తీ తొలగిపోతే నగలు కూడా స్వచ్ఛమైనవి తయారవుతాయి. ఈ లక్ష్మీ-నారాయణుల ఆత్మ మరియు శరీరము రెండూ సతోప్రధానముగా ఉంటాయి. మీ ఆత్మ మరియు శరీరము, రెండూ తమోప్రధానముగా, నల్లగా ఉన్నాయి. ఆత్మ కామచితిపై కూర్చొని నల్లగా అయిపోయింది. తండ్రి అంటారు, మళ్ళీ నేను వచ్చి నలుపు నుండి తెల్లగా తయారుచేస్తాను. ఇదంతా జ్ఞానము యొక్క విషయము. అంతేకానీ నీరు మొదలైనవాటి విషయమేమీ లేదు. అందరూ కామచితిపై కూర్చొని పతితులుగా అయిపోయారు, అందుకే పావనంగా అయ్యే ప్రతిజ్ఞను చేయండి అని రాఖీ కట్టడం జరుగుతుంది.

తండ్రి అంటారు, నేను ఆత్మలతో మాట్లాడతాను. నేను ఆత్మల తండ్రిని, నన్ను మీరు - బాబా రండి, మమ్మల్ని సుఖధామములోకి తీసుకువెళ్ళండి, దుఃఖాన్ని హరించండి అని తలచుకుంటూ వచ్చారు. కలియుగములో అపారమైన దుఃఖాలు ఉంటాయి. తండ్రి అర్థం చేయిస్తారు, మీరు కామచితిపై కూర్చొని నల్లగా, తమోప్రధానముగా అయిపోయారు, ఇప్పుడు నేను వచ్చాను కామచితి నుండి దించి జ్ఞానచితిపై కూర్చోబెట్టడానికి, ఇప్పుడు ఇక పవిత్రముగా అయి స్వర్గములోకి వెళ్ళాలి, తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి ఆకర్షిస్తారు. బాబా వద్దకు ఒక జంట వస్తారు - ఒకరికి ఆకర్షణ కలుగుతుంది, ఇంకొకరికి కలగదు. నేను ఈ అంతిమ జన్మలో పవిత్రముగా ఉంటాను, కామచితిపైకి ఎక్కను అని భర్త వెంటనే అనేశారు, అలాగని నిశ్చయం ఏర్పడిపోయిందని కాదు. ఒకవేళ నిశ్చయం ఏర్పడినట్లయితే అనంతమైన తండ్రికి ఉత్తరము వ్రాస్తారు, కనెక్షన్ లో ఉంటారు. వారు పవిత్రముగా ఉంటున్నారు కానీ తమ వ్యాపార, వ్యవహారాలలోనే నిమగ్నమైపోయి ఉంటున్నారు అని విన్నాము. తండ్రి స్మృతి ఎక్కడ ఉంది. ఇటువంటి తండ్రినైతే ఎంతగానో స్మృతి చేయాలి. భార్యా-భర్తలకు పరస్పరం ఎంత ప్రేమ ఉంటుంది, భర్తను ఎంతగా తలచుకుంటుంది. అనంతమైన తండ్రినైతే అందరికంటే ఎక్కువ స్మృతి చేయాలి. ప్రేమించండి లేక తిరస్కరించండి, కానీ నేను మీ చేతిని ఎప్పుడూ వదలను అన్న గాయనము కూడా ఉంది కదా. అలాగని ఇక్కడకు వచ్చి ఉండిపోవాలి అని కాదు, ఇళ్ళు-వాకిళ్ళను వదిలి ఇక్కడకు వచ్చి ఉండిపోవడమనేది చేస్తే అది మళ్ళీ సన్యాసమైపోతుంది. మీకైతే గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా అవ్వండి అని చెప్పడం జరుగుతుంది. మొదట్లో భట్టీ తయారవ్వవలసి ఉంది, అందులో నుండి ఇంతమంది తయారై వెలువడ్డారు, వారి వృత్తాంతము కూడా ఎంతో బాగుంది. ఎవరైతే తండ్రికి చెందినవారిగా అయి, లోపల (యజ్ఞములో) ఉంటూ ఆత్మిక సేవను చేయరో, వారు వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు, ఆ తర్వాత చివరిలో నంబరువారు పురుషార్థానుసారముగా కిరీటము లభిస్తుంది. వారి వంశము కూడా ఉంటుంది, వారు ప్రజలలోకి రాలేరు. బయటివారు వచ్చి లోపలివారిగా అవ్వలేరు. వల్లభాచారులు బయటివారిని ఎప్పుడూ లోపలికి రానివ్వరు. ఇవన్నీ అర్థం చేసుకోవలసిన విషయాలు. జ్ఞానము ఒక్క క్షణముదే, మరి తండ్రిని జ్ఞానసాగరుడు అని ఎందుకు అంటారు? వారు అర్థం చేయిస్తూనే ఉంటారు, చివరి వరకూ అర్థం చేయిస్తూనే ఉంటారు. ఎప్పుడైతే రాజధాని

స్థాపన అయిపోతుందో, మీరు కర్మాతీత అవస్థకు చేరుకుంటారో, అప్పుడు జ్ఞానం పూర్తి అవుతుంది. వాస్తవానికి ఇది ఒక్క క్షణము విషయము, కానీ ఇది అర్థం చేయించవలసి ఉంటుంది. హద్దు తండ్రి నుండి హద్దు వారసత్వము లభిస్తుంది, అనంతమైన తండ్రి విశ్వాధిపతులుగా చేస్తారు. మీరు సుఖధామములోకి వెళ్తే మిగిలినవారంతా శాంతిధామములోకి వెళ్ళిపోతారు. అక్కడైతే అంతా సుఖమే సుఖము. తండ్రి వచ్చారు, ఇలా రావడమనేది వారి పాలన. మనము రాజయోగము యొక్క చదువు ద్వారా కొత్త ప్రపంచానికి యజమానులుగా అవుతున్నాము. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ పతిత ఛీ-ఛీ ప్రపంచముపై అనంతమైన వైరాగ్యాన్ని ఉంచి ఆత్మను పావనంగా చేసుకునేందుకు పూర్తి-పూర్తి పురుషార్థము చేయాలి. ఒక్క తండ్రి ఆకర్షణలోనే ఉండాలి.

2. జ్ఞాన ధారణ ద్వారా మీ బ్యాటరీని నింపుకోవాలి. జ్ఞాన రత్నాలతో స్వయాన్ని ధనవంతులుగా చేసుకోవాలి. ఇప్పుడు ఇది సంపాదన చేసుకునే సమయము, అందుకే నష్టము నుండి రక్షించుకోవాలి.

వరదానము:- జ్ఞాన రత్నాలను ధారణ చేసి వ్యర్థాన్ని సమాప్తము చేసే హోలీహంస భవ

హోలీహంసకు రెండు విశేషతలు ఉంటాయి - ఒకటేమో జ్ఞాన రత్నాలను గ్రోలడము మరియు రెండు - నిర్ణయ శక్తి ద్వారా పాలును మరియు నీటిని వేరు చేయటము. పాలు మరియు నీరు అంటే అర్థము - సమర్థము మరియు వ్యర్థము యొక్క నిర్ణయము. వ్యర్థమును నీటితో సమానము అని మరియు సమర్థమును పాలతో సమానము అని అంటారు. కావున వ్యర్థాన్ని సమాప్తము చెయ్యటము అనగా హోలీహంసలుగా అవ్వటము. నిత్యం బుద్ధిలో జ్ఞాన రత్నాలు మెదులుతూ ఉండాలి, మననం జరుగుతూ ఉండాలి, అప్పుడు రత్నాలతో నిండుగా అవుతారు.

స్లోగన్:- సదా తమ శ్రేష్ఠ పొజిషన్ లో స్థితులై అపోజిషన్ ను సమాప్తం చేసేవారే విజయీ ఆత్మలు.